ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 293 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 1 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘన



## కెసిఆర్‌కు నోటీసుల పేరుతో వేధింపులు

### నేడు తెలంగాణలో నిరసనలకు కెటిఆర్ పిలుపు

6లో..

**నందినగర్ ఇంటికి నోటీసులు ఎలా అతికిస్తారు**

**అయినా మీకు విచారించే అధికారం లేదు**

**ఎర్రవెల్లిలో అందుబాటులో ఉంటానని చెప్పాను**

**నేరుగా నోటీసులు ఇవ్వకుండా**

**రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారు**

**జూబ్లీహిల్స్ ఎసిపికి మాజీ సిఎం కెసిఆర్ లేఖ**

**నేటి విచారణకు అందుబాటులో ఉంటానని వెల్లడి**

**హైదరాబాద్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని మాజీ సిఎం కేసీఆర్ పేర్కొన్నారు. నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఆరు పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. క్రైమ్ నంబర్ 243/2024 విచారణకు సంబంధించి తన వివరణను ఈ లేఖలో వివరించారు. ముఖ్యంగా నందినగర్ నివాసం గోడపై నోటీసు అతికించడంపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా నోటీసులు అతికించడం రాజ్యాంగ విరుద్ధమని కేసీఆర్ స్పష్టం చేశారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను.. వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని గుర్తు చేశారు. తాను ప్రస్తుతం ఎర్రవల్లి నివాసంలో ఉంటున్నానని, అక్కడే విచారణ జరపాలని పోలీసులకు స్పష్టంగా తెలిపారు. ఈ సందర్భంగా సతేందర్ కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసు తీర్పును లేఖలో ఉటంకించారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న చిరునామాకు, సీఆర్పీసీ సెక్షన్ 160 కింద జారీ చేసే నోటీసులకు ఎలాంటి సంబంధం లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నివసిస్తున్న చిరునామాలోనే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం స్పష్టంగా చెబుతోందని తెలిపారు. హరీష్ రావుకు జారీ చేసిన నోటీసుల విషయంలో పోలీసులు వేర్వేరు ప్రమాణాలు పాటిస్తున్నారని కేసీఆర్ విమర్శించారు. ఈ తరహా చర్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని హెచ్చరించారు. పోలీసుల తీరు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతాయుతమైన పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తి సహకారం అందిస్తానని కేసీఆర్ వెల్లడించారు. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ..మిగతా 2లో



### స్థానికంగా గెలిచే వారికే

# పార్టీ అండ

**రెబల్స్ బెడద లేకుండా చూసుకోండి**

**కాంగ్రెస్ నేతలకు సూచించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నేతలను కోరారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. నామినేషన్ల పక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికలను ప్రతిష్మాత్మకంగా తీసుకోవాలి. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు. భాజపా, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే. రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి. పార్టీ బలహీనంగా ..మిగతా 2లో

# నేడు కేంద్ర బడ్జెట్

**ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం**

**ప్రవేశ పెట్టనున్న నిర్మలాసీతారామన్**

**ఆదాయపు పన్ను మినహాయింపులపైనే అందరి చూపు**



**న్యూఢిల్లీ, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

కేంద్రమంత్రి నిర్మలా సీతరామన్ ఆదివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ వార్షిక బడ్జెట్ ఎప్పటిలాగే కొన్ని మెరుపులు, మరికొన్ని విరుపులు ఉండేలా ఉంటుందన్న చర్చ సాగుతోంది. పెద్దగా ప్రభావితం కాకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశ పెడతారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడుతుంది. అయితే ఆదివారం ప్రవేశ పెట్టనున్న కేంద్ర ఆర్థిక బ్జడెట్ 2026 కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులు తమకు ఊరట లభించేలా బ్జడెట్ ..మిగతా 2లో

# మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్



**శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నిక**

**కార్యక్రమానికి దూరంగా శరద్ పవార్, సుప్రియా సూలె**

**అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ**

**ముంబై, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ, దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా శనివారంనాడు ప్రమాణస్వీకారం చేశారు. ముంబైలోని లోక్‌భవన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమె చేత ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మరో ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మహాయుతి మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎన్‌సీపీ నేతలు శరద్ పవార్, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో రాష్ట్రంలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం పగ్గాలను సునేత్ర ..మిగతా 2లో

### జనం నుండి వనంలోకి

# వన దేవతలు



**మేడారం, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

బుధవారం సారలమ్మ రాక తర్వాత మహాజాతర లాంఛనంగా ప్రారంభమై, ఆ మరుసటి రోజు సమ్మక్కను గద్దెపైకి తీసుకురాగా.. శుక్రవారం, శనివారం అశేష భక్త జనం వన దేవతలకు మొక్కులు సమర్పించారు. భక్తులు పోటెత్తడంతో మేడారం జనజాతరను తలపించింది. భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు చేసి.. బంగారం తులా భారం, మొక్కులు సమర్పించారు. జాతర నేపథ్యంలో.. భక్తిశ్రద్ధలతో వనదేవతలకు దేశం నలుమూలల నుండి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు. శనివారం ఇద్దరు తల్లులు కన్నెపల్లికి సారలమ్మ, చిలకలగుట్టకు సమక్క, పగిడిద్దరాజు, గోవిందరాజులను గద్దెలపై నుంచి ఆదివాసీ పూజారులు వారి వారి ఆలయాలకు తీసుకెళ్లారు. సమ్మక్క ప్రతిరూపమైన కుంకుమభరిణెతో సాయంత్రం ప్రారంభమై సూర్యాస్తమయం తర్వాత పూజారులు రాత్రి 7.55 నిమిషాలకు వన ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది.



### తెలంగాణను

# నిర్లక్ష్యం చేయొద్దు

**బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలి**

**గతంలో లాగా కాకుండా కేటాయింపులు పెరగాలి**

**వక్షత చూపిస్తే బీజేపీ ఎంపిలదే బాధ్యత**

**మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

కేంద్ర ప్రభుత్వం నేడు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తెలంగాణను నిర్లక్ష్యం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానికి వివక్ష ఉందన్నారు. దానిని సరిదిద్ది కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. తెలంగాణపై బడ్జెట్‌లో వివక్షత చూపిస్తే బీజేపీ ఎంపీలే బాధ్యత వహించాలని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో ..మిగతా 2లో

# 75 ఏళ్ల సంప్రదాయానికి నిర్మలా సీతారామన్ బ్రేక్!

**గత బడ్జెట్‌లలో పార్ట్ 'ఏ'లో అనేక అంశాలు**

**పన్ను, విధాన ప్రకటనలకు పరిమితమైన పార్ట్ 'బీ'**

**స్వల్పకాలిక ప్రాధాన్యతలు, దీర్ఘకాలిక లక్ష్యాల కోసం ఈసారి పార్ట్ 'బీ'**

2లో..

# సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘన

మొదటి పేజీ తరువాయి...

విచారణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నందినగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అక్రమ పద్ధతిలో జారీ చేసిన నోటీసులను విస్మరించే హక్కు తనకు ఉందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో తనకు సంబంధించిన నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచించారు. అలాగే ఏపీ హైకోర్టులోని వీడీ మూర్తి కేసు తీర్పును కూడా లేఖలో ప్రస్తావించారు. చట్టపరమైన అభ్యంతరాలున్నా తాను విచారణలో సిట్‌కు సహకరిస్తానని చెప్పారు. సిట్ పోలీసుల వైఖరి కోర్టు ధిక్కారం కిందకే వస్తుందని తెలిపారు. పోలీసుల తీరు నా వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందని వెల్లడించారు. కేసీఆర్ లేఖలో ఏం రాశారంటే.. 'సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకి వ్యతిరేకం. సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కిన సిట్ అధికారుల తీరు. సిట్ అధికారులకి నోటీసు ఇచ్చే అధికారమే లేదు. ఇది నా రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. మొన్న రెండుసార్లు సిట్ అధికారులు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధం, చట్టాలను అతిక్రమించి ఇచ్చారు. మీరు ఇచ్చిన మొదటి నోటీసుకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంవల్ల వేరే రోజు విచారణకు తేదీ ఇవ్వాలని చెప్పాను. దాంతోపాటు 65 ఏళ్ల పైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సెక్షన్ 160 అసఖఅ నిబంధనలను మీ దృష్టికి తెచ్చాను'



అని పేర్కొన్నారు. 'తదుపరి నోటీసులన్నీ కూడా ఎర్రవల్లిలోని నా నివాసానికే పంపాలని చెప్పాను. కానీ, ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి 9 గంటలకు నందినగర్ నివాసంలోని మా ఇంటి గోడకు అతికించినట్లు తెలుస్తోంది. ఆ లేఖ మీరే పంపినట్లయితే, మీ సూచనల మేరకే అతికించినట్లయితే, ఆ లేఖను తీవ్రంగా ఆక్షేపిస్తున్నాను. ఇది భారత రాజ్యాంగం, చట్టం, గౌరవ సుప్రీంకోర్టుల పట్ల మీకు ఏమాత్రం గౌరవం లేదు అనే విషయాన్ని సూచిస్తుంది. గతంలో సుప్రీంకోర్టు 'సతేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ' అనే కేసులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశించిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది' అని కేసీఆర్ తన లేఖలో సూచించారు. 'భవిష్యత్తు నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని చెప్పినప్పటికీ మీరు దాన్ని విస్మరించారు. కాబట్టి మీరు ఇచ్చిన రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదు, అది చెల్లదు. మీరు ఇచ్చిన నోటీసు నా రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘించడమే. నేను మీ పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ, పొరుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ నివసించడం లేదు. కాబట్టి మీకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. ఈ నోటీసుతో నన్ను కట్టడి చేసే అధికారం లేదు. ఎలక్షన్ అఫిడవిట్‌లో, అసెంబ్లీ రికార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఎర్రవల్లిలో విచారించలేమని మీరు చెప్పడం సరికాదు. నోటీసు ఇచ్చే సమయానికి వ్యక్తి ఎక్కడ నివసిస్తున్నారు అన్నదే ముఖ్యం. నేను కొన్ని సంవత్సరాలుగా ఎర్రవల్లిలో నివసిస్తున్నాను అన్నది నిర్వివాద అంశం. అక్కడే నా స్టేట్‌మెంట్ రికార్డ్ చేయవలసిన బాధ్యత మీపై ఉన్నది' అని పేర్కొన్నారు.



### 2036 ఒలింపిక్స్ నాటికి అంతర్జాతీయ స్థాయి

## క్రీడాకారులను తీర్చిదిద్దాలి

**విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా**

**వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్ష**

**హైదరాబాద్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాలకు పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. గోదావరి నది తీరంలో దాదాపు 69 ప్రాంతాలలో 74 పుష్కర ఘాట్లను గుర్తించామని అధికారులు తెలిపారు. త్వరితగతిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి తగు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ఈ రోజు రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీస్ లు, రవాణా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉన్నతాధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధి, సౌకర్యాల కల్పన, పరిపాలన వ్యవస్థ పై సమీక్షించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్రంలోని ఇతర ప్రముఖ దేవాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందిస్తున్న వసతులు, భద్రత, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ, రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట, వేములవాడ, భక్తుల రద్దీ ఉండే ఇతర ఆలయాల్లో దర్శన క్యూల నిర్వహణ, పార్కింగ్, త్రాగునీరు, టాయిలేట్స్, పరిసరాల పరిశుభ్రత నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేనేత కళాకారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలని సూచించారు. రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షా సమావేశంలో భూ భారతి రికార్డుల నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవలు, భూ సర్వేలు, సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయ భవనాల నిర్మాణం, ఇ-ఫైలింగ్, లైసెన్స్ సర్వేయర్లు, 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యసాధన, తదితర అంశాలపై సమీక్షించారు. క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సెట్విన్, రాష్ట్ర మ్యూజియమ్స్ అభివృద్ధి, ఆయా శాఖల పనితీరుపై సి.ఎస్ సమీక్షించారు. ప్రస్తుత కార్యక్రమాల అమలు స్థితి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల, తెలంగాణ 2047 విజన్ లక్ష్య సాధన పై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో రాబోయే 2036 ఒలింపిక్స్ నాటికి రాష్ట్రంలో అంతర్జాతీయ క్రీడాకారులను అధిక సంఖ్యలో తయారు చేసే విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ విధంగా క్రీడల అభివృద్ధికి యువతను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల వైపు మరింత ఆకర్షించే విధంగా విధానాలను రూపొందించాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. యువజన సర్వీసులు శాఖ ద్వారా అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ శిక్షణ, యువత సంక్షేమ కార్యక్రమాలు లక్ష్య సాధనలో ఉండేలా పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, కోచింగ్ సదుపాయాలు, ప్రోత్సాహకాలు, అవార్డులు, ఆర్థిక సహాయంపై సమీక్ష జరిపి ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా సీఎం కప్ వాట్సాప్ యాప్ ను ఆవిష్కరించారు. పర్యాటక రంగంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించాలని అన్నారు. రవాణా, రోడ్లు భవనాలు శాఖ సమావేశంలో రాష్ట్ర రహదారుల నిర్మాణం, నిర్వహణ, ప్రభుత్వ భవనాల నిర్మాణ పురోగతి, నాణ్యత ప్రమాణాలు, ప్రజలకు అందిస్తున్న సేవల సామర్థ్యం తదితర అంశాలపై ప్రధాన కార్యదర్శి సమగ్రంగా సమీక్షించారు. రహదారుల అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి కీలకమని, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అనుసంధానించే రహదారుల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో చేపట్టిన పలు ప్రభుత్వ ఆసుపత్రులు వరంగల్, ఎల్.బి.నగర్, ఆల్వాల్, సనత్ నగర్, న్యూ ఉస్మానియా, హైకోర్టు నూతన భవనం, భవన నిర్మాణ పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలని, వాహనాల నమోదు, డ్రైవింగ్ లైసెన్సులు, రహదారి భద్రత చర్యల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.



### తొర్రూరు మున్సిపాలిటీని

## దత్తత తీసుకుంటా

**మంత్రి పొంగులేటి హామీ**

**తొర్రూరు జనవరి 31 (ప్రభాత ఉదయం)**

తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర రెవిన్యూ & గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమం పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సాగింది. తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని 01వ వార్డులో మంత్రి పొంగులేటి గల్లీ గల్లీ తిరుగుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టి, 01వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాళ్లపల్లి శ్రీలత రమేష్ ను చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అనంతరం మెయిన్ రోడ్డులో ర్యాలీగా బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని స్పష్టం చేస్తూ, తొర్రూరు మున్సిపాలిటీని దత్తత తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. త్రాగునీరు, డ్రైనేజీ, రహదారులు, గృహ నిర్మాణ పథకాలు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు ప్రజలు ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మున్సిపాలిటీని సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించేందుకు కట్టుబడి ఉన్నామని, ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, పేదలు, మహిళలు, యువత సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే తొర్రూరు పట్టణానికి మంచి రోజులు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీపీఐ నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## స్థానికంగా గెలిచే వారికే పార్టీ అండ

మొదటి పేజీ తరువాయి...

ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి' అని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికల సర్వే నివేదికలను టీపీసీసీ చీఫ్ సీఎంకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ 90 శాతం స్థానాలను కైవసం చేసుకోవాలని రేవంత్ రెడ్డి టార్గెట్ నిర్దేశించారు. రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. ఫిబ్రవరి 3 నుంచి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో జీహెచ్ ఎంసీకి మినహాయింపునిచ్చారు. మొత్తం 2,996 వార్డులకు పోటీ జరగనుంది. ఈనెల 28 నుంచి ప్రారంభమైన నామినేషన్ల పక్రియ శుక్రవారంతో ముగిసింది. శనివారం నాడు నామినేషన్ల పరిశీలన జరుగనుంది. ఫిబ్రవరి మూడున నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన వచ్చాక పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించి మున్సిపల్ ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఆపై ఫిబ్రవరి 3 నుంచి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్న సీఎం.. పలు జిల్లాల్లో నిర్వహించే ప్రచార సభల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.



### 75 ఏళ్ల సంప్రదాయానికి

## నిర్మలా సీతారామన్ బ్రేక్!

**గత బడ్జెట్‌లలో పార్ట్ 'ఏ'లో అనేక అంశాలు**

**పన్ను, విధాన ప్రకటనలకు పరిమితమైన పార్ట్ 'బీ'**

**స్వల్పకాలిక ప్రాధాన్యతలు, దీర్ఘకాలిక లక్ష్యాల కోసం ఈసారి పార్ట్ 'బీ'**

**న్యూఢిల్లీ, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

తొమ్మిదవసారి బడ్జెట్ ప్రవేశపెడుతున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, 75 సంవత్సరాల సంప్రదాయానికి ముగింపు పలకనున్నారు. భారతదేశ ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించి వివరణాత్మక దృక్పథాన్ని ఆవిష్కరించడానికి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలోని పార్ట్ 'బి'ని ఉపయోగించుకోనున్నారు.

గత కేంద్ర బడ్జెట్‌లలో చాలా విషయాలు పార్ట్ 'ఏ'లో ఉండగా, పార్ట్ 'బి'ని పన్ను, విధాన ప్రకటనలకు పరిమితం చేశారు. ఈసారి భారత్ 21 శతాబ్దం రెండవ త్రైమాసికంలోకి అడుగుపెడుతున్న సమయంలో, పార్ట్ 'బి' స్వల్పకాలిక ప్రాధాన్యతలు, దీర్ఘకాలిక లక్ష్యాలను వివరిస్తుందని, భారత స్థానిక బలాలు, ప్రపంచ ఆశయాలను హైలెట్ చేస్తుందని తెలుస్తోంది.

నిర్మలా సీతారామన్‌కు ఇది తొమ్మిదవ బడ్జెట్. 2019లో మొదటిసారి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు లెదర్ బ్రీఫ్ కేసును ఎరుపు వస్త్రంతో చుట్టిన సాంప్రదాయ పద్ధతిలో బడ్జెట్ పత్రాలను సభకు తీసుకువచ్చారు. గత నాలుగేళ్లుగా కాగిత రహిత బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు.

కాగా, సాధారణంగా కేంద్ర బడ్జెట్‌లో పార్ట్ 'ఏ', పార్ట్ 'బీ' ఉంటాయి. పార్ట్ 'ఏ' ప్రభుత్వ వ్యయ ప్రణాళికలు, మౌలిక సదుపాయాలు, వివిధ రంగాలకు కేటాయింపులు వివరిస్తుంది. పార్ట్ 'బి' ఆదాయ మార్గాలు, ప్రధానంగా ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో మార్పులు, సవరణలు తెలియజేస్తుంది.



## మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్

మొదటి పేజీ తరువాయి...

చేపట్టారు. విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపీ అయిన ఆమె శనివారం ఉదయం ముంబైలోని విధాన్ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎన్సీపీ ఎమ్మెల్యేలతో సునేత్రా పవార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్యాంగం ప్రకారం శాసన సభ లేదా శాసన మండలికి ఎన్నిక కాని వ్యక్తి కూడా మంత్రి పదవి చేపట్టవచ్చు. అయితే ఆ వ్యక్తి ఆరు నెలల్లోగా శాసనసభ సభలేదా శాసనమండలి సభ్యుడిగా ఎన్నికవ్వాలి. దీనికి ముందు, శనివారం ఉదయం ఎన్సీపీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లెజిస్లేటివ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో సునేత్ర పేరును ఎమ్మెల్యే దిలీప్ వాల్సే పాటిల్ ప్రతిపాదించగా, ఎన్సీపీ మంత్రి ఛగన్ భుజ్‌బుల్ బలపచారు. అనంతరం ఏకగ్రీవంగా పార్టీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర ఎన్నికయ్యారు. సునేత్ర పవార్ డిప్యూటీ సీఎం పదవితో చేపట్టంతో అజిత్ పవార్ చేపట్టిన శాఖలను కూడా ఆమెకు అప్పగించనున్నారని తెలుస్తోంది. అయితే అజిత్ పవార్ చేతిలోని ఆర్థిక శాఖను మాత్రం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తన వద్దే ఉంచుకోనున్నారని, దీనికి బదులుగా మరో శాఖను ఆమెకు అప్పగిస్తారని తెలుస్తోంది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సునేత్ర పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, దివంగత అజిత్‌దాదా పవార్ కలలను సాకారం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తారనే నమ్మకం తనుకుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

### తెలంగాణను

## నిర్లక్ష్యం చేయొద్దు


మొదటి పేజీ తరువాయి...

మాట్లాడారు. ఈ పౌర్ణమి తెలంగాణకు వెలుగులు తెస్తుందా..? , చీకటి ఇస్తుందా..? చూడాలని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిసారీ తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకత ఉందన్నారు. రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన వంటి తెలంగాణ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ విషయంపై కేంద్రానికి, బీజేపీకి చివరిసారిగా గుర్తు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాసంస్థల స్థాపనకు మోదీ ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు తెలంగాణకి వస్తే తాము గౌరవంగా కలుస్తున్నామని ప్రస్తావించారు. పక్క రాష్ట్రాలకి నిధులు కేటాయిస్తే తాము తప్పు పట్టడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# ఉద్యోగ విరమణ చేసిన హెచ్ ఎం
# ఎం సుగుణారెడ్డికి ఘన సన్మానం




ఎం సుగుణా రెడ్డి దంపతులను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్..




హెచ్ ఎం సుగుణా రెడ్డి, ఐ ఏ ఎస్ అధికారిని అన్వేషా రెడ్డి లను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు వై శ్రీధర్

**బుద్వేల్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులే తన సొంత బిడ్డల్లా భావిస్తు ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసిన ఏం సుగుణా రెడ్డి బాధ్యతలు నిర్వహించారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ కొనియాడారు. ఎం సుగుణారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సన్మాణ సభ లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సుగుణారెడ్డి శేష జీవితం ఆయూరారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుణ్ణి ప్రార్ధిస్తున్నానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను అత్యున్నత స్థానంలో నిలపడానికి ప్రధానోపాద్యాయురాలుగా డాక్టర్ ఎం సుగుణారెడ్డి చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న డాక్టర్ సుగుణారెడ్డి ఉపాధ్యాయులందరికి ఆదర్శనీయం అని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి సుశీం దర్రావు అన్నారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కు తాను నాలుగు సార్లు ఆకస్మిక తనిఖీ కి వచ్చానని. ఆ సమయంలో ఆమె స్కూల్ లోనే తన విధులలో నిమగ్నమై కనిపించారన్నారు. సుగుణారెడ్డి కి అనేక సార్లు ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డులు వచ్చాయన్నారు. ఎం సుగుణారెడ్డి కుమార్తెగా పుట్టడం అదృష్టం గా బావిస్తున్నానని ఒడిస్సా రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కమిషనర్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖల డైరెక్టర్ జనరల్ పి. అన్వేషరెడ్డి అన్నారు. నిరంతరం తాను పనిచేస్తున్న పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించే మంచి మనస్సున్న వ్యక్తి సుగుణారెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విధ్యాభారతి దక్షిణ మధ్య క్షేత్రం సంఘటన కార్యదర్శి లింగం సుదాకర్ రెడ్డి , విశ్రాంత ప్రధానో పాద్యాయులు యుగేందర్ రెడ్డి , రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాద్యాయులు ఝాన్సీరాణి, పూర్వ విద్యార్థులు వై. చిన్మయానంద స్వామి, క్రిష్టారావు, వై.శ్రీధర్, రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు జి.శరవణ్ కుమార్. పి.జగన్మోహన్ రెడ్డి, పి.సూర్యనారాయణ, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాద్యాయురాలు జయ శ్రీనివాస్, ఉపాధ్యాయులు జె శ్రీనివాసరావు తో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వైష్ణవి

## హుడా కాలనీలో వీధి కుక్కల వీరంగం

**బుద్వేల్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ హుడా కాలనీలో శనివారం పది సం సవత్సరాల బాలిక పై వీధి కుక్కలు దాడి చేశాయి. శనివారం రోడ్డుపైన నడుచుకుంటు వెళుతున్న అంబాదాస్ కుమార్తె వైష్ణవి పై వీధి కుక్క దాడి చేసి కాలుకు గాయం చేశాయి. చుట్టుపక్కల ఉన్న వారు గమనించి కుక్కను వెళ్లగొట్టారు. ఆ బాలికను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. హుడా కాలనీలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, గ్రేటర్ వెటర్నరీ విభాగం అధికారులు కుక్కలను పట్టుకెళ్లాలని స్థానికులు కోరారు.

## డీసీఎం బోల్తా

**బుద్వేల్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు పై డీసీఎం బోల్తా



ఏసియన్ పేయింట్స్ బస్తాలతో శనివారం ఉదయం రాజేంద్రనగర్ టోల్ ప్లాజా వైపు వెళుతున్న ఓ డీసీఎం వ్యాన్ (టీఎస్08 యూజీ 5441) టైర్ బస్ట్ కావడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అఫ్రోజ్ కు ఎలాంటి గాయాలు కాలేదు. డీసీఎం లోని ఇంకొక వ్యక్తి ఉన్నప్పటికి ప్రమాదమేమి జరుగలేదు. పమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేల్లుకుని బోల్తా పడిన డీసీఎం వ్యాన్ ను, డ్రైవర్ నుంచి వివరాలు సేకరించారు.





రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల డైరీ విభాగంలో పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందిన ఎండీ మహ్మద్ దంపతులను సన్మానిస్తున్న పీవీ నర్సింహ్మారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎ శరత్ చంద్ర, మాజీ రిజిష్ట్రార్ డాక్టర్ కె కొండల్రెడ్డి, ఉద్యోగ సంఘాల్ నాయకులు మహ్మద్ షర్ఫుద్దీన్ తదితరులు. మహ్మద్ విధి నిర్వాహణలో నిక్కచ్చిగా పని చేసేవారన్నారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో విలసిల్లాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు. -బుద్వేల్, ప్రభాత ఉదయం



అత్తాపూర్ వారంతపు సంతలో ప్లాస్టిక్ వాడవద్దని దుకాణదారులకు అవగాన కల్పిస్తున్న డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ స్వాతీ, రిసోర్స్ పర్సన్స్

## నేడు గగన్ పహాడ్, షాపూర్‌లలో విద్యుత్ సరఫరాల అంతరాయం

**రాజేంద్రనగర్/శంషాబాద్, జనవరి 31(ప్రభాత ఉదయం)**



గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తులు నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హర్షవర్ధన్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు అక్షయ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన పారిశ్రామిక వాడ, హౌసింగ్ సొసైటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, శ్రీరామ్నగర్, లంబాడి బస్తి, పారిశ్రామిక ప్రాంతం, శివాజీ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు శివాజీ నగర్ పారిశ్రామిక వాడ, శివాజీ నగర్, శ్రీరామ్ కాలనీ (జల్ పల్లి) విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు జల్పల్లి, శ్రీరామ్ కంపెనీ, పారిశ్రామిక వాడ త్రిశూల్ మెటల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పారిశ్రామిక వాడ, సర్వీసింగ్ గల్లి, పద్మశాలి పురం పీడర్ పరిధిలో గల ప్రాంతాలైన పద్మశాలిపురం, మధువన్, టీఎస్జీవోస్ కాలనీ, ఆప్కో కాలనీ, పహల్ ఫుడ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పారిశ్రామిక వాడ ప్రాంతం, ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ ఇండస్ట్రియల్, శివశక్తి విద్యుత్ పీటర్ పరిధిలో గల ప్రాంతాలైన పారిశ్రామిక వాడ, ఆనంద నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**షాపూర్ లో...**

శంకరాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని షాపూర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని శంకరాపురం, చర్లగూడ, ఐఎంపీ కాలేజ్, సంఘీ గూడ, తొండుపల్లి, సుభహాన్ గ్రీన్, ఇందిరమ్మ కాలనీ, ఓంకార్ క్యారియర్స్, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మహాస్ సబ్ స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన ముచిత్తల్, మేకల బండ తాండ, మదనపల్లి తాండ, జిమ్స్ హాస్పిటల్, స్వర్ణ భారత్ ట్రస్ట్, స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## వారాంతపు సంతలలో ప్లాస్టిక్ కవర్‌లను వాడద్దు

### డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ ఎ స్వాతి

**బుద్వేల్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**



వారాంతపు సంతలలో దుకాణదారులు ప్లాస్టిక్ కవర్ లను వినియోగించవద్దని, అదే సమయంలో ప్రజలు కూడా ప్లాస్టిక్ కవర్లలో కూరగాయలు తీసుకువెళ్లవద్దని అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ ప్రాజెక్టు అఫీసర్ డాక్టర్ ఎ స్వాతి అన్నారు. ఇదే విషయమై ఇటీవల కాలంలో డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ బ్యాగుల స్థానంలో బట్ట బ్యాగులను వాడాలన్నారు. మార్కెట్ ముగిసిన అనంతరం ఎవరి దుకాణం వద్ద వారు శుభ్రం చేయాల్సి ఉం టుందన్నారు. ఎవరైన ప్లాస్టిక్ సంచులు వాడితే వారిపై జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అత్తాపూర్ సర్కిల్ లో 100 శాతం ప్లాస్టిక్ నిషేధం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### హైదరాబాద్ జాయింట్ సీపీ శ్రీనివాస్

**బుద్వేల్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండటం మం చిదని హైదరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో శనివారం వ్యవసాయ కళాశాల విద్యార్థులతో పాటు రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.అనుమానితులు కాల్ చేసి బ్యాంక్ వివరాలు అడిగితే తెలియజేయవద్దన్నారు. పెరుగుతున్న సాం కేతికతను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితులలో ఇతరులకు ఇవ్వవద్దన్నారు. సెల్ఫోన్ లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీయం, ఫోన్ ఫే. గూగుల్ ఫే. ఈకేవైసీ అప్డేట్ వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అదే సమయంలో తాము నివసిస్తున్న ప్రాంతాలలో, తమ




అవగాహన సదస్సులో పాల్గొన్న హైదరాబాద్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్

కుటుంబ సభ్యులను సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండేలా చూడాలన్నారు. ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్ కు దూరంగా ఉండాలన్నారు. ఆందులో పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకుని పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయన్నారు. ఎవరైన బ్యాంకు అధికారులమని, పోలీసులమని మీ ఖాతా వివరాలు ఇవ్వండి అని భయపెడితే



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

భయపడవద్దన్నారు. అనుమానిత లింకులను క్లిక్ చేయవద్దన్నారు. అవగాహన సదస్సులో రాజేం ద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.గోవర్దన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను చైతన్యం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# మున్సిపల్ ఎన్నికలు బాధ్యతాయుతంగా అధికారులు నిర్వహించాలి: కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 31 (ప్రభాత ఉదయం)**




ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించెందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో షాద్ నగర్ మున్సిపాలిటీకి సంబంధించిన నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్ తో కలిసి శనివారం పరిశీలించారు .నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను పరిశీలిస్తూ ఏ విధంగా స్క్రూటిని చేస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకొని, పొరపాట్లు జరగకుండా చేయాలని, వారికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి షాద్ నగర్ మున్సిపాలిటీకి సంబంధించిన ఏర్పాట్లను, ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తు, ఎన్నికలకు సంబంధించిన ఫర్నిచర్ అదేవిధంగా స్టేషనరీ తదితర అంశాలను మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డిని అడిగి తెలుసుకొని వాటిని పరిశీలించారు. నామినేషన్లకు సంబంధించి స్క్రూటిని ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. స్ట్రాంగ్ రూమును, కౌంటింగ్ హాల్ ను పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అశ్రద్ధ చేయకూడదని సజావుగా జరిగే విధంగా అధికారులు సిబ్బంది అందరూ కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఏర్పాట్లను ప్రక్రియను పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లు మరియు 13న జరగబోయే కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ వెంట షాద్ నగర్ ఆర్డిఓ సరిత, షాద్ నగర్ తహశీల్దార్ నాగయ్య, స్పెషల్ ఆఫీసర్ రామరావు, ఎస్.హరీష్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు



## ఫిబ్రవరి 2 నుండి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జితేందర్ రెడ్డి**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 31(ప్రభాత ఉదయం):**

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కే జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లా ప్రాక్టికల్స్ కేంద్రంలోని చీఫ్ సూపరిండెంట్ లతో సమావేశం జరిగింది.ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు - 2026 ను జిల్లా లో 11 పరీక్ష కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లావ్యాప్తంగా ప్రాక్టికల్ పరీక్షలు 2 ఫిబ్రవరి 2026 నుండి 11 ఫిబ్రవరి 2026 వరకు రెండు సెక్షన్ లలో పరీక్షలు ఉదయం 9.00 గంటలకు, మధ్యాహ్నం 2.00 గంటలకు రోజు రెండు బ్యాచ్లలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం సైన్స్ విద్యార్థులు 2508 ఒకేషనల్ విద్యార్థులు 2311 ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ సమావేశంలో చీఫ్ సూపరిండెంట్ లకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశం లో డెక్ సభ్యులు శ్రీనివాస్, వి శేఖర్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేస్తున్న జడ్జి సుచరిత

## రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా జడ్జి

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 31(ప్రభాత ఉదయం):**

ఆర్టిఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ నూతన సంవత్సర క్యాలెండర్ నుజనగామ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఈ.సుచరిత శనివారం జిల్లా కోర్ట్ సముదాయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఆర్టిఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ. స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్.గద్దె అనిల్ కుమార్, అడ్వాకెట్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ భాస్కుల నాగరాజు, ఆకుల శ్రీకాంత్, దండు అశోక్ తదితరులు పాల్గొన్నారు. జనగామ తహసీల్దార్ కార్యాలయం లో ఆర్టిఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ జనగామ జిల్లా ఇంచార్జ్ పడమటింటి యేసు పాదం ఆధ్వర్యంలో ఆర్టిఐ నూతన సంవత్సరం క్యాలెండర్ను జనగామ తహసీల్దార్ మోసిన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డి.అనిల్ గౌడ్, కత్తుల సుధాకర్, దండు నాగరాజు ఆకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా చైతన్యానికి ప్రతీక గద్దర్: ఆదిత్య రెడ్డి

**గద్దర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు**

**పటాన్ చెరు, జనవరి 31 (ప్రభాత ఉదయం):**



తెలంగాణ ప్రఖ్యాత విప్లవ కవి, ప్రజా గాయకుడు, ఉద్యమకారుడు గద్దర్ జయంతి సందర్భంగా ఆయనకు తెలంగాణ యువజన కాంగ్రెస్ ప్రోటోకాల్ ఛైర్మన్ ఆదిత్య రెడ్డి ఘన నివాళులు అర్పించారు. తన గళాన్ని ఆయుధంగా మార్చుకుని, అణచివేతకు గురైన వర్గాల హక్కుల కోసం, సామాజిక అసమానతల నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు గద్దర్ అని ఆయన సేవలను ఆదిత్య రెడ్డి కొనియాడారు. గద్దర్ ఆశయాలను కొనసాగిస్తూ, యువత ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆయన కోరారు.




## చైనా మాంజాల వలన కలిగే నష్టాలపై హెచ్చరికలతో ప్రచారం

**నిషేధిత చైనా మాంజాల తొలగించిన పోలీసులు**

పటాన్ చెరు, జనవరి 31 (ప్రభాత ఉదయం): నిషేధిత చైనా మాంజాల వలన కలిగే నష్టాలపై అవగాహనతో కూడిన ప్రచారాన్ని శనివారం బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం. రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు నిషేధిత మాంజాల వలన పక్షులకు, మనుషులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చెట్లపై, ఎలక్ట్రికల్ స్థంబాల పై చిక్కుకున్న చైనా మాంజాలను సైబరాబాద్ కమీషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల సహకారంతో తొలగించడం జరిగిందని బొల్లారం సి ఐ రవీందర్ రెడ్డి తెలిపారు.బొల్లారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పోలీస్ సిబ్బంది తో కలిసి చైనా మాంజాలను ఆయన తొలగించారు.ప్రజలు అందరు చైనా మాంజాలను వాడవద్దని ఈ సందర్భంగా నిర్వహించిన ప్రచారంలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బొల్లారం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకంకు దరఖాస్తుల ఆహ్వానం

**31 మార్చి 2026 లోపు దరఖాస్తు చేసుకోవాలి**

**జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి డాక్టర్ బి.విక్రమ్ కుమార్**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 31(ప్రభాత ఉదయం)**



అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి క్రింద ఉన్నత చదువులకై అందించే ఆర్థిక సహాయం కొరకు మార్చి 31 లోపుదరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి డాక్టర్ బి.విక్రమ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి గాను అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి అర్హులైన వారు (ఏదైనా 4 సంవత్సరాల డిగ్రీ చదివిన /చివరి సంవత్సరం చదువుతున్న) వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్ కొరియా, మొదలగు దేశాలలో ఉన్నత చదువు చదివేందుకు వెళ్ళేవారు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జనగామ జిల్లాలోని ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 31 లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.



## జిహెచ్ఎంసి అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా?:

**మాజీ కౌన్సిలర్, డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్**

**అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రజల సమస్యలు పట్టవా**

**ప్రజాపాలన అంటే ఇదేనా.! ప్రజలను సమస్యల సుడిగుండంలో దించడమేనా..**

**రాజేంద్రనగర్,జనవరి31(ప్రభాత ఉదయం)**

ప్రజల సమస్యల పరిష్కారంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్,మైలార్ దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి,లకు చిత్తశుద్ధి లేదని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు.శనివారం ఉమ్మడి మైలార్ దేవ్ పల్లి డివిజన్లో ప్రారంభమైన రెండో విడత శుభోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజా ప్రతినిధుల పనితీరును ఎండగట్టారు.ప్రధానంగా బృందావన్ కాలనీ పరిసర ప్రాంతాలలో పర్యటించారు.ఆయా కాలనీలో బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ...స్థానిక శాసనసభ్యులు స్థానిక కార్పొరేటర్ నివాసాలకు కూత వేటు దూరంలో ఉన్న బస్తీలు దుస్థితి అగమ్యగోచరంగా ఉందని,నిత్యం మురుగు నీటితో కృష్ణ గోదావరి నదిలాగా యేరులై పారుతున్నాయని అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తూ పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజాపాలన అంటే ఇదేనా ప్రజలను సమస్యల సుడిగుండంలో దించడమేనా ప్రభుత్వం పని అని ఘాటుగా విమర్శించారు.ప్రజలు కడుతున్న టాక్స్ పైసలు ఏమవుతున్నాయో,నిధులు ఎటు దారి తప్పుతున్నాయో,పేద ప్రజలను సమస్యలు పట్టించుకోకుండా విహారయాత్రలు చేయటం ఈ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నాయకులకు ఓట్లు వేసిన పాపానికి సొంత నిధులతో పనులు చేసుకోవడం అవుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారని అడుగడుగునా బస్తీ వాసులు మొరపెట్టుకుంటున్నారని,వారి బాధ వర్ణణాతీతమని ఆవేదన చెందారు.కావున స్థానిక ప్రజా ప్రతినిధులు అయిన ఎమ్మెల్యే కానీ,కార్పొరేటర్ కానీ ఈ సమస్యలపై దృష్టి సారించి వెంటనే కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కోలన్ సుభాష్ రెడ్డి,పోయిల జీవన్ దాస్,రాముయాదవ్,యూత్ అధ్యక్షులు రఘు యాదవ్,రాజేష్ యాదవ్,ఎడ్లకాడి సూర్యం,గుమ్మడి కుమార్,సునీల్,ఆర్ కుమార్,బాలరాజు యాదవ్,అశోక్, చంద్రశేఖర్, గౌతమ్,అనిల్,చికెన్ రాజు,జి రాజు, వెంకట రమణ,సంఘం సతీష్, సలీం, అరుణరెడ్డి,ప్రసన్న,సుగుణమ్మ,పద్మ,పుష్పమ్మ,గోపాల్ నాయక్,సురేందర్ యాదవ్, లోకేష్,ప్రవీణ్,సన్నీ,పోతరాజు రమేష్,నరేష్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

## సమాజంలో అసమానతలు, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన గొంతుక గద్దర్

**మహాదేవుని శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండల అధ్యక్షుడు**

**కొమురవెల్లిలో ఘనంగా జరిగిన ప్రజా యుద్ధనౌక గద్దరన్న 78వ జయంతి వేడుకలు**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 31(ప్రభాత ఉదయం):**

కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రజా వాగ్గేయకారులు, ప్రజా యుద్ధనౌక గద్దరన్న 78వ జయంతి వేడుకలు తెలంగాణ సాంస్కృతిక సారథి కవి గాయకులు పిన్నింటి రత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ పాల్గొని గద్దరన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా యుద్ధనౌక, తెలంగాణ పోరాటయోధుడు గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) అణచివేతకు వ్యతిరేకంగా తన ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన పోరాటవీరుడు అని, సమాజంలో అసమానతలు, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన గొంతుకని, గద్దర్ పాటలు, ఆలోచనలు, పోరాటస్ఫూర్తి ప్రజల మధ్య శాశ్వతంగా జీవిస్తాయని మహదేవుని శ్రీనివాస్ కొనియాడినారు. గద్దర్ జయంతిని ప్రజా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు, ఆయన పేరుతో అవార్డును నెలకొల్పి ప్రతి ఏటా కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు గద్దర్ అవార్డు లను ప్రదానం చేయాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి ఉప సర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిన్నింటి దాసు, దేవస్థానం డైరెక్టర్లు సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య యాదవ్, మాజీ ఎంపిటిసి మేరుగు కృష్ణ, పాక్స్ మాజీ డైరెక్టర్ బత్తిని నర్సింహులు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరువుల రాజు, సెక్రటరీ ఉప్పల వంశీ, పంజాల నర్సింహులు, తీన్మార్ మల్లన్న టీం నాయకులు పుట్ట రమేష్, పిన్నింటి కుమార్, గడ్డం పర్శరాములు, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ రమేష్, కిష్టంపేట కుమార్, వెల్దె ఆంజనేయులు, గొల్లపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణ బాధ్యతతో నిర్వర్తించాలి: కలెక్టర్ సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 31 (ప్రభాత ఉదయం)**





ఎన్నికల పోలింగ్ లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని, బాధ్యతతో పనిచేసి మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. శనివారం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఐడిఓసి సమావేశపు మందిరంలో ప్రీసైడింగ్ అధికారులకు పోలింగ్ నిర్వహణపై మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులకు ఏమైనా సందేహాలు ఉంటే ముందుగానే శిక్షకులను అడిగి పరిష్కరించుకోవాలని సూచించారు. హ్యాండ్బుకు క్షుణ్ణంగా అధ్యయనం చేసి అందులోని నిబంధనల ప్రకారం పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వర్తించాలన్నారు. ఎలక్ట్రోరల్ ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారందరికీ ఓటు హక్కు కల్పించాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులు రాజకీయ పార్టీల గుర్తులతో పోటీ చేస్తున్నందున అధికారులు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా జాగ్రత్తగా తమ విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతి ఒక్క ఓటు ముఖ్యమేనని, పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉండి ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించి విజయవంతం చేసినట్లే, మున్సిపల్ ఎన్నికల్లో కూడా సమర్థవంతంగా పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రిసైడింగ్ అధికారులకు పిలుపునిచ్చారు. అంతకుముందు మాస్టర్ శిక్షకులు పోలింగ్ నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులకు సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎన్నికల జనరల్ పరిశీలకులు చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి రమేష్ బాబు, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాలభివృద్ధి కోసం అధికారులు, సర్పంచులు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

గ్రామాల సమగ్ర అభివృద్ధికి సర్పంచ్‌లు , అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్ లో పలు గ్రామ సర్పంచ్‌లు జిల్లా కలెక్టర్ ను కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలు,అభివృద్ధి కార్యక్రమాల అమలు పరిస్థితి, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై సర్పంచ్‌ల నుంచి వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు తెలిపిన సమస్యలను విని, సానుకూలంగా స్పందించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో విద్య,ఆరోగ్యం,రోడ్లు,నీటి సరఫరా,పంచాయతీ పనులు , పర్యావరణ పరిరక్షణ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సహాయ ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

## జిల్లా మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులు, వృద్ధులు , ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ తెలంగాణ రాష్ట్రంలో వికలాంగుల సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో భాగంగా, సంబంధించిన Aids  Appliances సరఫరా పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా మహిళా శిశు సంక్షేమ దివ్యాంగులు వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. ఈ పథకం ద్వారా క్రింది ఉపకరణాలు / సౌకర్యాలు అర్హులైన వికలాంగులకు అందించబడతాయి. బ్యాటరీ వీల్చైర్స్,మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్ (ఎంపవర్ కార్ట్),హైబ్రిడ్ వీల్చైర్ అటాచ్మెంట్తో కూడిన వీల్చైర్స్,డిగ్రీ విద్యార్థులకు ల్యాప్టాప్స్, ఉన్నత విద్య / సాంకేతిక విద్య విద్యార్థులకు ల్యాప్టాప్స్,(ట్యాబ్‌లు) అందజేయడం జరుగుతుందన్నారు. గతంలో దరఖాస్తులు అందకపోవడం వల్ల కొన్ని జిల్లాల్లో లక్ష్యాలు చేరుకోలేకపోయినందున, ఇప్పుడు OBMMS Online Beneficiary Management and Monitoring System 38 3 దరఖాస్తులు స్వీకరించనున్నారు. అర్హులైన వికలాంగులు అందరూ తప్పనిసరిగా https.tgobmms.cgg.gov.in జనవరి 31 నుండి ఫిబ్రవరి 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



# గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా

## గుడిహత్నూర్ గ్రామ సర్పంచ్ ఆడే శీల

## ఎన్నికల హామీ అమలులో మరో కీలక ముందడుగు

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 31(ప్రభాత ఉదయం)**

గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని గుడిహత్నూర్ గ్రామ సర్పంచ్ ఆడే శీలా అన్నారు. శనివారం గుడిహత్నూర్ గ్రామంలో నూతన లైబ్రరీ , విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేస్తామన్నారు. గ్రామంలో నూతన లైబ్రరీ భవన నిర్మాణానికి సంబంధించి శనివారం అధికారికంగా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆడే శీలా స్థానిక ఎంపీడీఓ ని కలిసి, గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు, అలాగే వివో బిల్డింగ్ నిర్మాణంపై విస్తృతంగా చర్చించారు. విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయం అవసరమని వివరించారు. అదేవిధంగా, లైబ్రరీ , వివో బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించి గ్రామ పంచాయతీ సమావేశంలో ఆమోదం పొందిన అధికారిక తీర్మాన పత్రాన్ని ఎంపీడీఓ కి అందజేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పరిపాలనా అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. అనంతరం, లైబ్రరీ , వివో బిల్డింగ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. పనులు త్వరలోనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆడే శీలా మాట్లాడుతూ:"గ్రామంలోని యువత, విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు, విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయం ఎంతో అవసరం. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం, గుడిహత్నూర్ గ్రామంలో ఆధునిక లైబ్రరీని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంట ఉప సర్పంచ్ లందాడే నిఖిల్, ఆడే జైపాల్, వార్డ్ మెంబర్ అవినాష్, గ్రంథాలయ సిబ్బంది, గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు ఉన్న దృష్ట్యా సోమవారం ప్రజావాణి రద్దు

## జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 31 (ప్రభాత ఉదయం)**



రంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ నందు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. జిల్లా ప్రజలు, పిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.



హెల్మెంట్లను ప్రదానం చేస్తున్న జిల్లా కలెక్టర్

# జనగామ రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత పైన క్విజ్ పోటీలు

## క్విజ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెల్మెంట్‌లను ప్రదానం చేసిన జిల్లా కలెక్టర్

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 31(ప్రభాత ఉదయం):**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా శనివారం జిల్లా కలెక్టరేట్ లో రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రత క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ చేతుల మీదుగా హెల్మెట్స్ పంపిణి చేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్ గౌడ్, ఎఎంవిఐ మహేష్ గౌడ్ జిల్లా విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 2న షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ సమీక్ష సమావేశం

## షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ రాష్ట్ర కన్వీనర్ చిప్పలపల్లి అవిలయ్య

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 31(ప్రభాత ఉదయం)**



షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ రాష్ట్ర కమిటీ ఆదేశాలతో హైదరాబాద్ లోని ఎల్బీనగర్ జై భారత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం ఫిబ్రవరి 2 న (సోమవారం) ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేయటం జరిగిందని, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ రాష్ట్ర కన్వీనర్ చిప్పలపల్లి అవిలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఏజెన్సీ ప్రాంతం పేరుతో ఎస్సీలు కోల్పోయిన రాజ్యాంగ హక్కులను తిరిగి అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఎస్సీ కులాల జనాభా పెరిగినందున జనాభా దామాషా ఆధారంగా షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ 20% పెంచాలనె డిమాండ్ పైన సమీక్షించి భవిష్యత్ కార్యాచరణ వెల్లడించడం జరుగుతుందని, తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ డాక్టర్ జే బి రాజు పాల్గొంటారని తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాన్ని సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యచరణలో నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావడానికి తప్పకుండా సకాలంలో హాజరుకావాలని కోరారు.



# బేలలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 31(ప్రభాత ఉదయం )**

ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలో విశ్వసృష్టికర్త భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలను శనివారం మరాఠీ వడ్రంగి కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బేల మండల కేంద్రంలోని సంఘ భవనం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ ప్రపంచ సృష్టి, నిర్మాణ రంగాల్లో భగవాన్ విశ్వకర్మ పాత్ర అనిర్వచనీయమని, ఆయన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని తెలిపారు. కులస్తులంతా ఐక్యంగా ఉన్నప్పుడే తమ హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బేల ఎస్ఐ ప్రవీణ్, బేల సర్పంచ్ భాగ్యలక్ష్మి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు అశోక్ టాక్రే, మాజీ సర్పంచులు మస్కే తేజ రావు, దేవన్న, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విలాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండవార్, మాజీ జెడ్పీటీసీ రాందాస్త్రస్ నాక్లే, సుధాం రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు సామ రూపేష్ రెడ్డి, భారాసా మండల అధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, నాయకులు గంభీర్ ఠాక్రే, భాజపా నాయకులు దత్తానికం నవీన్, సందీప్ రాము బర్కాడే, కుల సంఘం జిల్లా అధ్యక్షుడు జె. సంతోష్, మండల అధ్యక్షుడు అభయ్, వెంకటి, వివిధ గ్రామాల సర్పంచులు, కులస్తులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ మోడల్ స్కూల్స్‌ను స్కూల్ ఎడ్యుకేషన్ లో వీలీనం చేయాలి

## టిఎస్ఎం ఎస్ టిఎఫ్ డిమాండ్

**పటాన్ చెరు, జనవరి 31 (ప్రభాత ఉదయం):**

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 194 మోడల్ స్కూల్ ను స్కూల్ ఎడ్యుకేషన్ లో విలీనం చేసి 010 ద్వారా వేతనాలు ఇవ్వాలని టిఎస్ఎం ఎస్ టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి కొండయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం బొల్లారం తెలంగాణ మోడల్ స్కూల్ లో నిర్వహించిన కార్యక్రమంలో టిఎస్ఎం ఎస్ టి ఎఫ్ క్యాలెండర్ ను పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు ఇవ్వాలని, చనిపోయిన ఉపాధ్యాయ కుటుంబాలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని పెండింగ్లో ఉన్న డి ఏ బకాయిలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా హెల్త్ క్వార్టర్స్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్. విఠల్, కే. సతీష్,




శ్రీకాంత్, సరియ రాజేశ్వర్, లక్ష్మీకాంత్, రమేష్, నాగరాజు, స్వప్న, ఉషశ్రీ, పుష్ప సుజాత, కృష్ణన్, మెయినుద్దీన్,కృప,యూనస్,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

## అభివృద్ధి, సంక్షేమం, ఆత్మగౌరవం

# బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యం

**ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**

**బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు**

**పటాన్ చెరు, జనవరి 31 (ప్రభాత ఉదయం):**




జిన్నారం మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, గడ్డపోతారం మున్సిపాలిటీ ఎన్నికల ఇంఛార్జి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో మాజీ ఉపసర్పంచులు నకీర్తి శ్రీనివాస్, నక్కిర్తి లక్ష్మయ్య, నాయకులు నకిర్తి వీరేష్, రాజముల్లా కరుణాకర్, మున్నూరు వీరేష్, నకీర్తి రామచందర్, నక్కిర్తి భాస్కర్, యద భాస్కర్, లక్ష్దారం, భాస్కర్, లింగయ్య, మూనూరీ వీరేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవ్వడం ఖాయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లోనే కాదు ఆ పార్టీ సొంత నాయకుల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు.రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని ఇచ్చిన హామీలు నెరవేర్చలేక చేతులు ఎత్తేశారని విమర్శించారు. అందుకే అభివృద్ధిని కాంక్షించే కరుడుగట్టిన కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. జిన్నారం మున్సిపాలిటీలో ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు.పార్టీని నమ్ముకొని చేరిన వారికి పార్టీలో సముచిత స్థానం గౌరవం ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జిన్నారం వెంకటేష్ గౌడ్,మాజీ సర్పంచ్ జనార్దన్ జిన్నారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాయికోటి రాజేష్, మాజీ ఉప సర్పంచ్ కృష్ణ, నకీర్తి రాజు,నాయకులు కుమార్, నర్సింగ్ రావు, భీమ్ రావు,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# అత్తాపూర్ సర్కిల్‌లో పార్కుల అభివృద్ధికి కృషి



అత్తాపూర్ చింత కుంట పార్కులో పాదచారులతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య



చింత కుంట పార్కులో డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తున్న జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ ఆలీ, చిత్రంలో సామాజిక కార్యకర్త మ్యాడమ్ మధుసూదన్

**డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య**

**బుద్వేల్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలో 13 చెరువులు, అనేక పార్కులు ఉన్నాయని, వాటి చుట్టు పరిసరాలను శుభ్రం చేయించడం, మౌళిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందని అత్తాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ వి సమ్మయ్య తెలిపారు. శనివారం ఆయన హైదర్‌డ పెద్ద తాళ్ల కుంట, చింత కుంట పార్కులను సిబ్బంది తో కలిసి పరిశీలించారు. పార్కుల వద్ద పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు అత్తాపూర్ సర్కిల్ లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఈ సం దర్భంగా ఆయన పాదచారులు. సామాజిక కార్యకర్తలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

**చింతకుంట పార్కు లో డ్రైనేజీ మరమ్మత్తులు :**

రాజేంద్రనగర్ డివిజన్ జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ అలీ చింతకుంట పార్కులో డ్రైనేజీ మరమ్మత్తులు చేయించారు. సామాజిక కార్యకర్త మ్యాడం మదుసూదన్ విజ్ఞప్తి మేరకు ఆయన చింతకుంట పార్కులో పాదచారులకు ఇబ్బందులు లేకుండ పనులు చేయిం చారు.

# రాజేంద్రనగర్‌లో గద్దర్ జయంతి




గద్దర్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

**బుద్వేల్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

ప్రజా యుద్ధ నౌక గద్దర్ 78వ జయంతి సందర్భం గా శనివారం రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. గద్దర్ ఓ చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మంత్రి చంద్రశేఖర్, వబాల రాజు, పోతురాజు యాదయ్య, పచ్చ నర్సింగరావు, పి.నర్సింహ్మా, గొడుగు సంజీవ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేస్తున్న జడ్జి సుచరిత

# రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా జడ్జి

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 31(ప్రభాత ఉదయం):**

ఆర్టిఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జనగామ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఈ.సుచరిత శనివారం జిల్లా కోర్ట్ సముదాయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఆర్టిఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ. స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్.గద్దె అనిల్ కుమార్, అడ్వాకెట్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ భాస్కుల నాగరాజు, ఆకుల శ్రీకాంత్, దండు అశోక్ తదితరులు పాల్గొన్నారు. జనగామ తహసీల్దార్ కార్యాలయం లో ఆర్టిఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ జనగామ జిల్లా ఇంచార్జ్ పడమటింటి యేసు పాదం ఆధ్వర్యంలో ఆర్టిఐ నూతన సంవత్సరం క్యాలెండర్ను జనగామ తహసీల్దార్ మోసిన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డి.అనిల్ గౌడ్, కత్తుల సుధాకర్, దండు నాగరాజు ఆకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# జిహెచ్ఎంసి బడ్జెటు ఆమోదం

**రూ.11,460 కోట్ల బడ్జెట్ ప్రకటన**

**ఫిబ్రవరి 10తో ముగియనున్న పదవీకాలం**

**హైదరాబాద్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలక మండలి 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11,460 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. గ్రేటర్ పదవీకాలం ఫిబ్రవరి 10తో ముగియనుంది. ఈ నేపథ్యంలో శనివారం చివరి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11,460 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వివిధ పార్టీల కార్పొరేటర్ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కేసీఆర్ హయాంలో జీహెచ్ఎంసీ అప్పుల పాలైందని, అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళన చేశారు. అయితే మేయర్ గద్వాల విజయలక్ష్మి నచ్చచెప్పడంతో ఇరు పార్టీల కార్పొరేటర్లు సర్దుమణిగారు. అనంతరం 2026–27 బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. బడ్జెట్ పద్దుల్లో జీహెచ్ఎంసీకి వివిధ మార్గాల్లో వచ్చిన ఆదాయం : రూ.6,441కోట్లుగా చూపారు. ఇందులో జీహెచ్ఎంసీ ఖర్చు : రూ.4,057కోట్లు, రెవెన్యూ మిగులు : రూ.2,384 కోట్లు, జీహెచ్ఎంసీ రెవెన్యూ గ్రాంట్స్ : రూ.400 కోట్లుగా చూపారు. కొత్తగా విలీనమైన మున్సిపాలిటీల కోసం కేటాయింపులు: రూ.2,260 కోట్లుగా చూపారు. విలీనమైన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన రెవెన్యూ : రూ.1,860 కోట్లుగా ప్రకటించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.. 'ఇది మా చివరి సమావేశం. భావోద్వేగంతో కూడుకున్నది. ప్రతి నిర్ణయం వెనుక మీ బాధ్యత కనిపించింది. ఉద్యోగులు, సిబ్బంది సమర్థంగా పని చేశారు. నగర అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిది. అంతా కలిసికట్టుగా పని చేశారు. ప్రజలకు మెరుగైన సేవల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు లభించాయి. పదవి ముగిసినా నా బాధ్యత మరువను. నగరం మరింతగా అభివృద్ధి చెందేందుకు నా వంతు కృషి చేస్తాను' అని విజయలక్ష్మి వెల్లడించారు.

# కెసిఆర్‌కు నోటీసుల పేరుతో వేధింపులు

**నేడు తెలంగాణలో నిరసనలకు కెటిఆర్ పిలుపు**

**హైదరాబాద్, జనవరి 31 (ప్రభాత ఉదయం)**




సిట్ విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా కేసీఆర్‌ను వేధిస్తున్నందుకు నిరసనగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు నేతలు నిరసన ప్రదర్శనలు చేయాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్రమంతటా శాంతియుతంగా ఆందోళనలకు దిగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 12 వేలకుపైగా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని సూచించారు. నిరసనల్లో భాగంగా ప్రతి మున్సిపల్, నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీలు నిర్వహించనున్నాయి. నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారు. ధర్నాలు, రాస్తారోకోల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయనున్నారు. మాజీ మంత్రులు, సీనియర్ నేతలు, పార్టీ శ్రేణులు ఆందోళనల్లో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. నిరసనలు శాంతియుతంగా చేయాలని, పోలీసులతో ఘర్షణలు వద్దని సూచించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608